సాక్షి తిరుపతి

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023

I



ఆదిలక్ష్మీదేవికి ఆస్థానసేవ

పెంచలకోనలో శ్రావణమాసం సందర్భంగా ఆదిలక్ష్మీదేవికి వైభవంగా ఆస్థానసేవ నిర్వహించారు. - IIలో



20 ఏళ్లు.. 33 కేసులు

వ్యసనాలకు బానిసగా మారిన ఓ యువకుడు ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్నాడు. - IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	34	24
తిరుమల	31	21
గూడూరు	38	27
నగరి	36	25

న్యూస్‌రీల్

ప్రశాంతంగా అగ్రి సెట్-2023

తిరుపతి సిటీ : ఏజీ బీఎస్సీలో స్పెషల్ కేటగిరీ అడ్మిషన్ల కోసం రంగంపేట రోడ్డులోని రామిరెడ్డిపల్లె అయాన్ డిజిటల్ సెంటర్‌లో శుక్రవారం అగ్రి సెట్-2023 ప్రశాంతంగా ముగిసింది. ఆన్‌లైన్‌లో జరిగిన ఈ పరీక్షకు 87 మంది విద్యార్థులకు గాను 84 మంది హాజరయ్యారు. ఇందులో మెరిట్ సాధించి, వ్యవసాయ పాలిటెక్నిక్‌లో పూర్తి చేసినవారికి ఏజీ బీఎస్సీలో 15శాతం సీట్లు కేటాయించనున్నట్లు ఆర్ఏఆర్ఎస్ సీనియర్ సైంటిస్ట్ తిరుమల రెడ్డి తెలిపారు. పరీక్షను తిరుపతి వ్యవసాయ ప్రాంతీయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ సి.రమణ పర్యవేక్షించారు.

ఓటర్ల తొలగింపుపై తనిఖీ



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో చేపట్టిన తొలగింపులపై కలెక్టర్ వెంకటరమణారెడ్డి తనిఖీ చేపట్టారు. శుక్రవారం తిరుపతి నియోజకవర్గంలో జిల్లా ఎన్నికల అధికారి హోదాలో ప్రక్రియను పరిశీలించారు. మారుతీ నగర్, రాయల్ నగర్‌లోని 251, 252, 253, బైరాగి పట్టెడ 148 పోలింగ్ బూత్‌ల పరిధిలోని గృహాలను సందర్శించి ఓటరు జాబితా నుంచి తొలగించబడిన వారి వివరాలు క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తిరుపతి ఈఆర్ఓ హరిత, చంద్రగిరి ఈఆర్ఓ కనకనరసారెడ్డి, తహసీల్దార్ వెంకట రమణ, ఎన్నికల డీటీ జీవన్ పాల్గొన్నారు.

వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

రేణిగుంట: మండలంలోని వనస్థలిలో ఉన్న రాస్ కేవీకేలో నిర్వహిస్తున్న వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో రెండేళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుత కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి పాస్, లేదా ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన 18-22 ఏళ్ల విద్యార్థులు ఈనెల 3వ తేదీ సాయంత్రం 5గంటల లోపు కరకంబాడి కేవీకే పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలన్నారు. వివరాలకు 9849951874, 7095688326 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

ఘనంగా 'ఓనం' వేడుకలు



సహపంక్తి భోజనాలు చేస్తున్న విద్యార్థులు

రేణిగుంట : మండలంలోని కుర్రకాల్వ సమీపంలో ఉన్న భారతీయ పాకశాస్త్ర సంస్థలో శుక్రవారం ఓనం పండుగను ఘనంగా నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ అకడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ ఎం.త్రిలోక్ చందర్ ఆధ్వర్యంలో విద్యార్థులు, సిబ్బంది కలసి విస్తారమైన పూల రంగోళీ నడుమ కుతువిలకు(దీపం) రాజైన మహాబలిని ఆవిష్కరించడానికి వెలిగించారు. అవియల్, తోరన్, ఓలన్, కాలాన్, పాల్ అడ ప్రదమన్ వంటి మలయాళీ సాంప్రదాయ వంటకాలను తయారు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం త్రిలోక్ చందర్ మాట్లాడుతూ తమ కళాశాలలో కలినరీ ఆర్ట్స్ బీబీఏ, బీఎస్సీ, ఎంబీఏలకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. ఇంటర్, గ్రాడ్యుయేషన్ విద్యార్హతతో ఆసక్తి కలిగిన వారు కోర్సుల్లో చేరవచ్చన్నారు. వివరాలకు 7901025668, 9985486271, 9444829841 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు చెల్లేశ్వరరావు, లోమ్టే, తిరుపతి గ్రాండ్ రిడ్జ్ హోటల్ జీఎం వికాస్, మలయాళీ అసోసియేషన్ ప్రెసిడెంట్ కుట్టి పాల్గొన్నారు.


పారామెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

తిరుపతి తుడా: శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాలలో అలైడ్ హెల్త్ సైన్స్ పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి 4వ తేదీన రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సెలక్షన్ కమిటీ నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం సీట్లు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. కౌన్సెలింగ్‌కు వచ్చే విద్యార్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని, అడ్మిషన్లు పొందిన వారు రూ. 8,150 ఫీజు చెల్లించాలని వివరించారు.

వస్తున్నా ఆదిత్యా

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సత్తా చాటుతోంది. దేశ ప్రతిష్ట ఇనుమడించేలా నూతన ప్రయోగాలకు శ్రీకారం చుడుతోంది. ఇటీవలే చంద్రయాన్-3 ద్వారా జాబిలిపై కాలుమోపింది. ప్రస్తుతం ఆదిత్య-ఎల్1తో సూర్యుడి రహస్యాల ఛేదనకు సన్నద్ధమైంది. సౌరగోళంలో వాతావరణాన్ని అధ్యయనం చేసేందుకు పీఎస్ఎల్వీ సీ57 రాకెట్ ద్వారా ఉపగ్రహ ప్రయోగానికి రంగం సిద్ధం చేసింది.

- సౌరగోళంపై పరిశోధనలకు సిద్ధమైన ఇస్రో
- పీఎస్ఎల్వీ సీ57 రాకెట్ ద్వారా ఆదిత్య-ఎల్1
- శ్రీహరి కోట షార్ నుంచి ప్రయోగం
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన శాస్త్రవేత్తలు



ఆదిత్య ఎల్1 ఉపగ్రహం

తిరుపతి సైన్స్ సెంటర్‌లో లైవ్ స్క్రీనింగ్

తిరుపతి కల్చరల్ : శ్రీహరి కోటలోని సతీష్ దావన్ స్పేస్ సెంటర్ నుంచి శనివారం ప్రయోగిస్తున్న ఆదిత్య ఎల్1 మిషన్ ఉపగ్రహ ప్రయోగాన్ని సందర్శించేందుకు సైన్స్ సెంటర్‌లో లైవ్ స్క్రీనింగ్ ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం ఈ మేరకు రీజనల్ సైన్స్‌సెంటర్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ మాట్లాడుతూ శనివారం ఉదయం 11 గంటలకు నుంచి లైవ్ స్క్రీనింగ్ ఉంటుందని, మధ్యాహ్నం 12 గంటలకు ఆదిత్య ఎల్1 మిషన్‌పై ప్యానెల్ ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు, విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సూళ్లూరుపేట : సౌరగోళంలో గాలులు, జ్వాలలు, రేణువుల తీరుతెన్నులపై పరిశోధనలకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పీఎస్ఎల్వీ సీ57 రాకెట్ ప్రయోగించనుంది. 1480.7 కిలోల ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని ఈ రాకెట్ ద్వారా శనివారం ఉదయం 11.50 గంటలకు ప్రయోగించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉపగ్రహం ప్రయోగం ద్వారా సూర్యుడిపై దాగి వున్న రహస్యాలను ఛేదించనున్నారు. సౌర తుఫాన్ సమయంలో వెలువడే రేణువుల వల్ల భూమిపై సమాచార వ్యవస్థకు అవరోధాలు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. దీంతో పాటు కాంతిమండలం (ఫోటోస్ఫియర్), వర్ణ మండలం (క్రోమోస్ఫియర్)లపై అధ్యయనం చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. సూర్యుడిపై అధ్యయనానికి ఇస్రో మొట్టమొదటిసారిగా ఈ ప్రయోగం చేపట్టింది.

పరిశోధనలకు 'పేలోడ్స్'

ఆదిత్య ఎల్1 ఉపగ్రహంలో ఏడు పేలోడ్స్ అమర్చి పంపుతున్నారు. 1,231 కేజీలు ద్రవ ఇంధనంతో ఉపగ్రహం నింపబడింది. మిగిలిన 249 కేజీలు పేలోడ్స్ బరువు వుంటుంది. ఉపగ్రహాన్ని సూర్యుడి వైపు తీసుకెళ్లేందుకు ద్రవ ఇంధనం అవసరం . మొదట ఉపగ్రహాన్ని భూ మధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తర్వాత భూమికి 15 లక్షలు కిలోమీటర్లు దూరంలోని లాగ్రేంజియన్ బిందువు-1 (ఎల్-1)లోకి చేరవేయడానికి 175 రోజులు పడుతుంది. ఆదిత్య ఎల్-1 ఉపగ్రహంలో సూర్యుడిపై అధ్యయనం చేయడానికి యాస్‌పెక్స్, సూట్, వెల్సీ, హెలియోస్, పాపా, సోలెక్స్, మాగ్ అనే ఏడు ఉపకరణాలు (పేలోడ్స్) అమర్చారు.

- 170 కేజీల బరువు గల విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్ (వెల్సీ) అనే పేలోడ్ ద్వారా సౌర వాతావరణం ఎందుకు వేడిగా వుంటుంది. సూర్యుడిలో మార్పులు, అంతరిక్ష వాతావరణం, భూమి వాతావరణాన్ని ఎలా ప్రభావితం చేస్తుందనే విషయాలపై పరిశోధనలు చేస్తుంది.
- సౌర అతినీలలోహిత ఇమేజింగ్ టెలిస్కోప్ (సూట్) అనే పేలోడ్ 35 కేజీల బరువు వుంటుంది. 200-400 ఎన్ఎం తరంగదైర్ఘ్యం పరిధి మధ్య సూర్యుడిని గమనిస్తుంది. ఇందులో 11 ఫిల్టర్లను ఉపయోగించడం ద్వారా సౌర వాతావరణంలో వివిధ పొరల పూర్తి డిస్క్ చిత్రాలను అందిస్తుంది. ఇది సూర్యుడ్ని నిరంతరం గమనిస్తూనే వుంటుంది. ఇస్రో ఇతర సంస్థల సహకారంతో పుణేలోని ఇంటర్-యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ నుంచి ఏఎన్ రామ్ ప్రకాష్, దుర్గేష్ త్రిపాఠి నేతృత్వంలో ఈ పేలోడ్‌ను అభివృద్ది చేశారు.
- ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పర్‌మెంట్ (యాస్‌పెక్స్) అనే పేలోడ్ ద్వారా సౌర గాలి వైవిధ్యం, లక్షణాలను తెలియజేయడమే కాకుండా దాని వర్ణ పటం లక్షణాలను అధ్యయనం చేస్తుంది.
- ఆదిత్య ప్లాస్మా ఎనలైజర్ ప్యాకేజీ (పాపా) సౌరగాలి కూర్పు దాని శక్తి పంపిణీని అర్థం చేసుకోవడానికి పరిశోధన చేస్తుంది.
- సోలార్ ఎనర్జీ ఎక్స్-రే స్పెక్ట్రోమీటరు (సోలెక్స్) సోలార్ కరోనా సమస్యాత్మకమైన కరోనల్ హీటింగ్ మెకానిజాన్ని అధ్యయనం చేయడానికి, ఎక్స్-రే మంటలను పర్యవేక్షించడానికి పరిశోధనలు చేస్తుంది.
- హై ఎనర్జీ ఎల్1 ఆర్బిటింగ్ ఎక్స్-రే స్పెక్ట్రోమీటర్ (హెలియోస్) సౌర కరోనాలో డైనమిక్ ఈవెంట్‌లను గమనించడానికి, విస్ఫోటనం..సంఘటనల సమయంలో సౌరశక్తి కణాలను వేగవంతం చేయడానికి ఉపయోగించే శక్తిని అంచనా వేస్తుంది.
- మ్యాగ్ అనే ఈ పేలోడ్‌ను మాగ్నోమీటర్ అని కూడా అంటారు. ఆదిత్య ఎల్1 ఉపగ్రహానికి ఆన్‌బోర్డు ఉపకరణంగా అమర్చి పంపుతున్నారు. ఇది ఉపగ్రహానికి సంబంధించి సమాచారాన్ని అందించేందుకు వినియోగిస్తారు.



వెల్సీ అనే పేలోడ్




సూట్



సోలెక్స్



హెలియోస్



యాస్‌ఫెక్స్



మాగ్

అక్టోబర్‌లో గగన్‌యాన్

- చెంగాళమ్మ ఆలయంలో ఇస్రో చైర్మన్ పూజలు



ఇస్రో ఛైర్మన్‌కు తీర్థప్రసాదాలు అందిస్తున్న ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి

సూళ్లూరుపేట : అక్టోబర్ నెలాఖరు నాటికి గగన్‌యాన్ ప్రయోగం నిర్వహించేందుకు భూస్థిర పరీక్షలు పూర్తి చేస్తున్నామని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. శుక్రవారం సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ శ్రీనివాసులురెడ్డి స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ చంద్రయాన్-3 సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తూనే సూర్యయాన్-1కు సిద్ధమయ్యామన్నారు. ఆదిత్య ఎల్1 ప్రయోగానికి శుక్రవారం 12.10 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించామని చెప్పారు. షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్, గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

ఆదిత్య నమూనాకు ప్రత్యేక పూజలు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఇస్రో డైరెక్టర్లు అమిత్‌కుమార్, డాక్టర్ మోహన్ దర్శించుకున్నారు. ఉపగ్రహ నమూనాను శ్రీవారి పాదాల చెంత ఉంచి పూజలు నిర్వహించారు.

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం ఇస్రో డైరెక్టర్లు దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వదించారు.

మరుపురాని మహానేత



2009 సెప్టెంబర్ 2వ తేదీ తెలుగుజాతి తీవ్ర దిగ్భ్రాంతికి గురైన రోజు.. అన్నదాతలు కన్నీరు పెట్టిన రోజు.. అక్క చెల్లెమ్మలు విలపించిన రోజు.. అవ్వాతాతలు ఆవేదనకు గురైన రోజు.. పేదల పెన్నిధి తిరిగిరాని లోకాలకు తరలిపోయిన రోజు.. రైతు బాంధవుడు లేడని, అపర భగీరథుడు ఇక రాడని వేలాది గుండెలు ఆగిపోయిన రోజు.. వ్యవసాయాన్ని పండుగలా మార్చిన మహనీయుడు దివికేగిన రోజు.. కరువు నేలను సస్యశ్యామలం చేసిన నిత్య కృషీవలుడు కన్నుమూసిన రోజు.. ప్రజల ముంగిటకే పాలన అంటూ "రచ్చబండ" కోసం చిత్తూరుకు వస్తూ నిష్క్రమించిన రోజు.. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా జిల్లాతో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ...

- అడుగడుగునా అభివృద్ధివై.. ప్రతి గుండెలో కొలువై!
- చిత్తూరు రచ్చబండకు వస్తూ.. అనంతలోకాలకు
- నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి

చిత్తూరు రూరల్: సంక్షేమానికి సరికొత్త భాష్యం చెప్పిన నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించిన ప్రగతి ప్రదాత. చిల్లుపడిన ప్రతి గుండెనూ పూడ్చిన ధన్వంతరి. పేద విద్యార్థులకు పెద్ద చదువుల భాగ్యం కల్పించిన మహనీయుడు. పాలనకు మానవతను అద్దిన మహానేత. నిరుపేద గోడు విని సొంత గూడు నెరవేర్చిన మానవతామూర్తి. శ్రీసిటీతో పారిశ్రామిక బాట వేసిన క్రాంతిదర్శి. అన్నదాతకు నీళ్లందించి కరువుకాటకాలను తరిమికొట్టిన అపరభగీరథుడు. ఇలా ఎన్నెన్నో.. రాజన్న పాలన స్వర్ణయుగమని ప్రజలు వేనోళ్ల కొనియాడుతున్నారు.

అనుప్పల్లె మరువని విషాదం

ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలు ఎలా ఉపయోగించుకుంటున్నారో ? తెలుసుకోవాలనే తపనతో పాటు అధికారుల్లో మరింతగా జవాబుదారీతనం తీసుకురావాలన్న లక్ష్యంతో డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 'రచ్చబండ' కార్యక్రమానికి 2009 సెప్టెంబర్2న శ్రీకారం చుట్టారు. చిత్తూరు మండలంలోని అనుప్పల్లెలో తొలిసారిగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రావాల్సిన వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో దూరమయ్యారు. "మేమేమి పాపం చేశామని.. మా ఊరికి రాకుండా వెళ్లిపోయావు రాజన్నా" అంటూ ఇప్పటికీ ఆ ఊరి ప్రజలు వైఎస్సార్‌ను తలచుకుంటూ శోకిస్తున్నారు.

శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన

తిరుపతి రూరల్ : పేరూరు పంచాయతీ పాతకాల్వలోని వకుళమాత ఆలయం ప్రాంగణంలో చేపట్టిన శ్రీలక్ష్మీనారాయణ యజ్ఞంలో భాగంగా శుక్రవారం మూడోరోజు శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్వర్ణలత దంపతులు, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దంపతుల, ఎమ్మెల్సీ భరత్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



లక్ష కుంకుమార్చనలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వేణుగోపాలకృష్ణ, ఎంపీ మిథున్‌రెడ్డి

అంకితభావంతో వైద్యసేవలు

తిరుపతి తుడా : ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా వైద్యులు అంకితభావంతో సేవలందించాలని టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుపతి స్విమ్స్‌లో శ్రీపద్మావతి మహిళా మెడికల్ కాలేజీలో నూతనంగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. భూమన మాట్లాడుతూ వైద్య వృత్తిలోకి ప్రవేశించడం అదృష్టంగా భావించాలన్నారు. వైద్య రంగంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు కృషి చేయాలని సూచించారు. అధ్యాపకులు చెప్పే ప్రతి అంశాన్ని నిశితంగా అధ్యయనం చేయాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత వైద్యులుగా రాటుదేలాలని కోరారు. వైద్య వృత్తిని దైవంతో సమానంగా భావించి సేవలు అందించాలన్నారు.



మాట్లాడుతున్న టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

ధనార్జనకు పవిత్రమైన వైద్య వృత్తిని వాడుకోవద్దని సూచించారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ టీటీడీ పరిధిలోని పద్మావతి మహిళా వైద్య కళాశాలలో చదువుకునే అవకాశం రావడం అదృష్టంగా భావించాలని తెలిపారు. కళాశాలలోని 175 సీట్లకు గాను ఇప్పటికి వరకు 152 మంది విద్యార్థినులు అడ్మిషన్లు పొందారని వెల్లడించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.ఉషా కలావత్, డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణా బిట్లా, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ముక్తేశ్వరయ్య, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

కౌలు రైతుకు 'భరోసా'



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

- 1,098 మంది ఖాతాల్లో రూ.82.35 లక్షలు జమ
- అర్హతే ప్రామాణికంగా పథకాలు
- సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదో ఏడాది తొలి విడతగా వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం కింద కౌలు రైతుల ఖాతాల్లో నగదు జమ చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్, పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు మెగా చెక్కు అందించిన అనంతరం సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూమి ఉన్నవారికే కాకుండా కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్న రైతులకు సైతం న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ పథకం కింద జిల్లాలోని 1,098 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.82.35లక్షలు జమ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి ప్రసాద రావు, కలెక్టరేట్ ఏడీఏ ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు కొత్త ట్యాబ్‌లు

తిరుపతి ఎడ్యుకేషన్ : బైజూస్ కంటెంట్‌తో ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లలో దెబ్బతిన్న వాటి స్థానంలో కొత్తవి పంపిణీ చేస్తున్నట్లు ఐటీ మానిటరింగ్ అధికారి రమేష్ తెలిపారు. శుక్రవారం రేణిగుంటలోని ఏపీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, బాలికల జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 80మంది విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలించి లోపాలను సరిదిద్దారు. అలాగే బాలికల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలించి సాఫ్ట్‌వేర్ లోపాలను సరిచేశారు. మరికొందరికి కొత్త ట్యాబ్‌లు అందించారు. తిరుపతి జిల్లా బైజూస్ నోడల్ అధికారి సురేష్ మాట్లాడుతూ ట్యాబ్ డిస్‌ప్లే పగిలిపోతే సమీప సచివాలంలోని డిజిటల్ అసిస్టెంట్ లేదా వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు అందజేయాలని సూచించారు.

ఆదిలక్ష్మీదేవికి ఆస్థాన సేవ


అమ్మవారికి హారతి సమర్పిస్తున్న అర్చకులు

రాపూరు : పెంచలకోనలో ఆదిలక్ష్మి దేవికి శుక్రవారం ఆస్థానసేవ నిర్వహించారు. అనంతరం ప్రాకారోత్సవం , కుంకుమార్చన జరిపించారు. ముందుగా ఆదిలక్ష్మీదేవి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపంలో పద్మ పీఠంపై కొలువుదీర్చారు. వివిధ రకాల పుష్పాలు ఆభరణాలతో అలంకరించి సహస్రనామార్చన, ఆస్థాన సేవ నిర్వహించారు.అనంతరం మేళతాళాలు మంగళవాయిద్యాలతో అమ్మవారికి ప్రాకారోత్సవం చేపట్టారు. కార్యక్రమానికి ఉభయదాతలుగా మధుస్వామి,సువర్ణలక్ష్మి వ్యవహరించారు.

మరింత నాణ్యంగా అన్నప్రసాదం

- డయల్ యువర్ ఈఓలో ఏవీ ధర్మారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుమల : టీటీడీ బోర్డు నిర్ణయం మేరకు మిల్లర్ల నుంచి బియ్యం కొనుగోలు చేస్తామని, మరింత నాణ్యంగా అన్నప్రసాదం తయారు చేయిస్తామని ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. ఆదివారం తిరుమల అన్నమయ్య భవన్‌లో నిర్వహించిన డయల్ యువర్ ఈఓలో ఆయన పాల్గొన్నారు. పలువురు భక్తులు ఫోన్‌లో అడిగిన ప్రశ్నలు, సమస్యలకు సమాధానమిచ్చారు.

■ **శంకర్ గౌడ్, హైదరాబాద్ :** వైకుంఠ ఏకాదశి రోజు దర్శనానికి సంబంధించిన సెప్టెంబర్ మొదటి వారంలో టికెట్లు విడుదల చేస్తే సౌకర్యవంతంగా ఉంటుంది.

ఈఓ : వైకుంఠ ఏకాదశి పర్వదినాలటికెట్లను డిసెంబర్ దర్శన టికెట్ల కోటాతో కలిపి ఆన్‌లైన్‌లో విడుదల చేస్తాం.

■ **రాజారామ్, రాజమండ్రి, వినత, హైదరాబాద్ :** సీనియర్ సిటిజన్లకు ఆఫ్‌లైన్‌లో దర్శన టికెట్లు ఇస్తే బావుంటుంది. అష్ట వినాయక విశ్రాంతి గృహంలో వసతులు లేవు.

ఈఓ : వృద్ధులు, వికలాంగుల దర్శనానికి కోటా పరిమితంగా ఉంది. ఎక్కువమంది భక్తుల కోరిక మేరకు ఆన్‌లైన్‌లోనే టికెట్లు విడుదల చేస్తున్నాం. అష్ట వినాయక విశ్రాంతి గృహంలోని 55 గదులను నాన్ ఏసీ చేసి రూ.150 చొప్పున అద్దెకు సామాన్య భక్తులకు కేటాయిస్తాం. దీనికి బదులుగా వికాస్ విశ్రాంతి గృహంలో 45 గదులను ఏసీ చేసి గీజర్ వసతి కల్పిస్తాం.

■ **నంద్యాల, రామకృష్ణ :** మా గ్రామంలోని ఆలయం దేవదాయ శాఖ పరిధిలో ఉంది. ధూప దీప నైవేద్యాలకు సహాయం చేయండి.

ఈఓ : ఈ విషయాన్ని దేవదాయశాఖ కమిషనర్‌కు తెలియజేయండి. మేము కూడా సిఫార్సు చేస్తాం.

■ **వెంకటరమణ, నెల్లూరు :** సుదర్శన సత్రంలో మరుగుదొడ్లు సరిగా లేవు.

ఈఓ : ఈ సత్రాలు 60 ఏళ్ల క్రితం నిర్మించారు. బోర్డు నిర్ణయం మేరకు మరో మూడేళ్లలో కొత్తవి నిర్మిస్తాం.

■ **చక్రవర్తి, తణుకు :** అంగప్రదక్షిణ టికెట్లను ఆఫ్‌లైన్‌లో ఇవ్వండి.

ఈఓ : అంగప్రదక్షిణ టికెట్ల కోటా పరిమితంగా ఉంటుంది. ఆఫ్‌లైన్‌లో ఎక్కువమంది క్యూలో వేచి ఉండాల్సి వస్తోంది. అందుకే ఆన్‌లైన్ చేశాం.

■ **శశి, తెలంగాణ :** అలిపిరి నడక మార్గంలో చిరుతల నుంచి భక్తులకు రక్షణ కల్పించేందుకు ఫ్లైఓవర్ నిర్మించండి.

ఈఓ : నడకదారి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉంది. ఈ ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టడానికి అటవీ శాఖ అనుమతి ఇవ్వాలి. ఆమేరకు తగు చర్యలు చేపడతాం.

■ **సత్యనారాయణ, కరీంనగర్ :** తిరుమలలో నడుపుతున్న ఉచిత బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉంది. బస్సులను పెంచండి.

ఈఓ : ఉచిత బస్సుల సంఖ్యను పెంచేందుకు ప్రయత్నిస్తాం.

■ **మోహన్ కృష్ణ, కడప :** మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు రూ.300 దర్శనం టికెట్లు తీసుకున్నా ఎక్కువ దూరం నడవాల్సి వస్తోంది. పర్వదినాల్లో తోపులాట ఎక్కువగా ఉంటోంది.

ఈఓ : మోకాళ్ళ నొప్పులతో బాధపడుతున్న వారు డాక్టర్ సర్టిఫికెట్‌తో వస్తే బయోమెట్రిక్ ద్వారా దర్శనానికి పంపుతాం.వైకుంఠ ఏకాదశి పర్వదినాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.

■ **ఉదయశ్రీ, హైదరాబాద్ :** ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవడం తెలియడం లేదు.

ఈఓ : ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవడం తెలియని వారు తిరుపతిలో టైంస్లాట్ దర్శన టోకెన్లు పొందవచ్చు.

చిన్నారి వైద్యానికి రూ.7 లక్షలు


చిన్నారి బంధువులకు నగదు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: లుకేమియా బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి పవిత్రకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.7 లక్షలు మంజూరైనట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈమేరకు శుక్రవారం నగదు చెక్కును కలెక్టరేట్‌లో చిన్నారి బంధువులకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్స కోసం ఆప న్న హస్తం ద్వారా చిన్నారి బండ్ల పవిత్రకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నగదు అందజేసినట్టు తెలిపారు. బాలిక తండ్రి దేవప్రకాష్‌ది వరదయ్యపాళెం మండలంలోని గోవర్ధనపాళెం గ్రామమని, సాధారణ ఎలక్ట్రీషియన్‌గా జీవిస్తున్నాడని తెలిపా రు. ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

ఇరువురి ఘర్షణ: ఒకరి మృతి


ఖాదర్ బాషా (ఫైల్)

వాకాడు : స్థానిక బీసీ కాలనీలో ఇరువురి మధ్య తలెత్తిన గొడవలో ఒకరు మృతి చెందారు. వివరాలు.. కాలనీలో షేక్‌ఖాదర్‌బాషా, బావమరి కరీముల్లా నివసిస్తున్నారు. కరీముల్లా పెరట్లో పెరుగుతున్న పూల మొక్కలు ఖాదర్‌బాషా ఇంటి వైపునకు వెళ్లాయి. దీంతో ఖాదర్‌బాషా గురువారం వాటిని నరికేశాడు. కరీముల్లా దీనిపై ఖాదర్‌బాషాను ప్రశ్నించాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఖాదర్‌బాషా(48)ను కరీముల్లా తీవ్రంగా కొట్టాడు. గాయపడిన ఖాదర్‌బాషాను వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు రసూల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ హరికృష్ణ, ఎస్ఐ రఘునాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

20 ఏళ్లు.. 33 కేసులు..!


వివరాలను వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

చంద్రగిరి : వయసుచూస్తే పట్టుమని 20 ఏళ్లు కూడా నిండలేదు. అయితే ఏకంగా 33 కేసుల్లో నిందితుడి ఉన్నాడు. చోరీలు, ద్విచక్రవాహనాల అపహరణలో సిద్ధహస్తుడిగా మారాడు. బాల నేరస్తుడిగా శిక్ష అనుభవించినా, బెంగళూరులోని రీహాబిటేషన్ సెంటర్‌లో చేర్పించినా తీరు మారలేదు. వ్యసనాలకు బానిసగా మారి దొంగతనాలకు దిగుతున్నాడు. గురువారం రాత్రి చేపట్టిన వాహనాల తనిఖీల్లో పట్టుబడిన ఓ యువకుడిని విచారిస్తే పోలీసులకు కళ్లు తిరిగే వాస్తవాలు బయటపడ్డాయి. శుక్రవారం ఈ మేరకు చంద్రగిరి సీఐ రాజశేఖర్ వివరాలు వెల్లడించారు. తిరుపతి పల్లెవీధికి చెందిన సురేష్ పూల వ్యాపారం చేస్తుండగా, భార్య చంద్రగిరి కొత్తపేటలో బ్యూటీపార్లర్ నిర్వహిస్తోంది. వారి కుమారుడు ప్రభుదత్ అలియాస్ ప్రభు హైదరాబాదులోని సెయింట్ జీసస్ పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్నాడు. అపై తిరుపతికి వచ్చిన ప్రభు వ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడ్డాడు. ఇళ్లలో దొంగతనాలను చేయడంతో అప్పట్లో ప్రభుదత్‌ను పోలీసులు పట్టుకుని జువైనల్ హోమ్‌కు తరలించారు. అక్కడ శిక్ష పూర్తి చేసుకున్న ప్రభుదత్‌ను మార్చడానికి కుటుంబ సభ్యులు అనేక విధాలుగా ప్రయత్నించారు. ఈ క్రమంలో బెంగళూరులోని రిహాబిటేషన్‌లో ఉంచి కౌన్సెలింగ్ ఇప్పించారు. అయినప్పటికీ ఈజీ మనీకి అలవాటు పడిన ప్రభుదత్ ద్విచక్ర వాహనాల చోరీలకు దిగాడు. ఇంటి ముందు ఉంచిన వాహనాలే అతడికి టార్గెట్. నిమిషాల వ్యవధిలో బైక్‌లను చోరీ చేసేవాడు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా అనేక కేసుల్లో పట్టుబడి జైలు జీవితం గడిపాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం చంద్రగిరిలో సీఐ రాజశేఖర్ ద్విచక్ర వాహనాలను తనిఖీలను నిర్వహిస్తుండగా ప్రభుదత్ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. అనంతరం విచారణలో ప్రభుదత్ ఇళ్లలో చోరీలతో పాటు ద్విచక్ర వాహనాలు అపహరించి ఇతర రాష్ట్రాలలో విక్రయిస్తున్నట్లు తెలిసింది. ముద్దాయి ప్రభుదత్‌పై చంద్రగిరి, నగరి, తిరుపతితో పాటు ఇతర ప్రాంతాలలో సుమారు 33 కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. చంద్రగిరిలో ఒకే రోజు మూడు ద్విచక్ర వాహనాలను చోరి చేసినట్లు గుర్తించామన్నారు. ముద్దాయి నుంచి 4 ద్విచక్ర వాహనాలు, రూ.25వేల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు హిమబిందు, రవీంద్ర నాయక్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ద్విచక్ర వాహనాలను ఎలా చోరీ చేస్తాడో నిందితుడితో స్టేషన్ ఆవరణలోనే సీన్ రీక్రియేషన్ చేయించారు. తాళాలు లేకుండా ద్విచక్ర వాహనాలను క్షణాల వ్యవధిలో చోరీ చేసే తీరును చూసి పోలీసులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

నాణ్యమైన విద్యకే ట్యాబ్‌లు


ట్యాబ్‌లు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

రేణిగుంట/తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకే ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు అన్నమయ్య జిల్లా బైజూస్ నోడల్ అధికారి సురేష్ తెలిపారు. శుక్రవారం రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు శిక్షణ నిచ్చారు. ట్యాబ్‌లో ఇచ్చిన కంటెంట్ తప్ప ఇంటర్నెట్ కంటెంట్ అప్లోడ్, డౌన్‌లోడ్ చేసేందుకు అవకాశం లేకుండా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించామన్నారు. ట్యాబ్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తితే సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధనం పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టుకు ఎంపిక


రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: రాష్ట్ర జట్టుకు తిరుపతి జిల్లా జట్టు క్రీడాకారులు ఎంపికైనట్లు డీఎస్‌డీవో, చీఫ్ కోచ్ షేక్‌సయ్యద్ తెలిపారు. తిరుపతి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన టోర్నీలో నాలుగో స్థానం సాధించిన తిరుపతి జట్టు అభినందన కార్యక్రమం శుక్రవారం క్యాంపస్ స్కూల్ మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ సయ్యద్, జిల్లా ఒలిపింక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.ప్రవీణ్ హాజరై తిరుపతి జిల్లా బాలుర జట్టును ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర జట్టుకు కే.చరణ్, వెంకట ప్రభువు, బీ.కార్తీక్, ఇషాన్ అలీ తదితరులు ఎంపికై నట్లు ప్రకటించారు. ఈ నలుగురూ అనంతపురంలో జరిగే కోచింగ్ క్యాంప్‌లో పాల్గొంటారని తెలిపారు. అలాగే తిరుపతి జిల్లా బాలికల జట్టు 3, 4 తేదీలలో అనంతపురంలో జరిగే ఇంటర్ డిస్ట్రిక్‌లో పాల్గొంటారన్నారు.

రైల్వే గేటును ఢీకొన్న కారు

పాకాల : అతివేగంగా వచ్చిన కారు రైల్వే గేటును ఢీకొట్టిన ఘటన శుక్రవారం మండలంలోని నేంద్రగుంట సమీపంలో చోటుచేసుకుంది. సీఐ ఓబులేసు కథనం.. పూతలపట్టు మండలం, తోటవారిపల్లెకు చెందిన టీ.రూపేష్ అతివేగంగా కారును నడుపుతూ రైల్వే గేటును ఢీకొట్టాడు. ఆపై అక్కడే ఉన్న మూడు ద్విచక్ర వాహనాలను గుద్దుకుంటూ ముందుకు వెళ్లిపోయాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారులకు గాయాలయ్యాయి. పాకాల పోలీసులు అతడిని వెంబడించి పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కేసు

ఏర్పేడు: మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. శుక్రవారం రాత్రి కోబాక క్రాస్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మేర్లపాక గ్రామానికి చెందిన కిషోర్ పట్టుబడినట్టు చెప్పారు. నిందితుడు మద్యం తాగి బైక్ నడిపినట్లు గుర్తించి, కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మంత్రిని కలసిన ఎస్వీయూ ఈసీ మెంబర్లు



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సురేంద్రనాథ్‌రెడ్డి, జ్యోతి

తిరుపతి సిటీ : ఎస్వీయూనివర్సిటీ నూతన పాలక మండలి సభ్యులుగా నియమితులైన వి.జ్యోతి, సీకాం విద్యాసంస్థల అధినేత టి. సురేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తామని, విద్యా, ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేలా నిర్ణయాలను తీసుకుంటామని తెలిపారు. అనంతరం సీకాం అధినేత సురేంద్రనాథ్‌రెడ్డి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

టీటీడీ ఎక్స్-అఫిషియో సభ్యుడిగా ఈఓ ప్రమాణ స్వీకారం




టీటీడీ ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన టీటీడీ ఈఓ ధర్మారెడ్డికి శ్రీవారి చిత్రపటం అందిస్తున్న జేఈఓ సదా భార్గవి, ఆలయంలో టీటీడీ పాలకమండలి సభ్యులు తిప్పేస్వామి, కేతన్‌దేశాయ్

తిరుమల: టీటీడీ కార్యనిర్వహణాధికారి ఏవీ ధర్మారెడ్డి శుక్రవారం తిరుమల శ్రీవారి ఆలయంలో టీటీడీ బోర్డు ఎక్స్-అఫిషియో సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే పాలకమండలి సభ్యులుగా డాక్టర్ కేతన్ దేశాయ్, డాక్టర్ తిప్పేస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి చెంత జేఈఓ సదా భార్గవి వీరి చేత ప్రమాణం చేయించారు. శ్రీవారిని ఈఓ దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. జేఈఓ శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ ఈఓలు లోకనాథం, గోవిందరాజన్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తిదారుల అభ్యున్నతికే 'విశ్వకర్మ'


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : కులవృత్తిదారులు, హస్తకళాకారుల అభ్యున్నతికే కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ప్రవేశపెట్టినట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈ పథకం కమిటీ సభ్యులు, అధికారులలో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సాంప్రదాయ కులవృత్తిదారులు, హస్తకళాకారులు తమ వ్యాపారాన్ని బలోపేతం చేసుకోవడానికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈనెల 17వ తేదీ నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుందన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్వయం సహాయక సభ్యులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసి కులవృత్తుల వారికి అవగాహన కల్పించడంతోపాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించాలని స్పష్టం చేశారు.18 ఏళ్ల నిండినవారు ఈ పథకం కింద లబ్ధిపొందేందుకు అర్హులని తెలిపారు. విశ్వకర్మ యోజన కింద మొదటి దశలో రూ.లక్ష , రెండో విడతలో రూ.2 లక్షల రుణాన్ని 5 శాతం సబ్సిడీ వడ్డీతో మంజూరు చేస్తారని వివరించారు. అలాగే నైపుణ్య శిక్షణ, పనిముట్లకు సంబంధించి రూ.15 వేల వరకు ఇన్సెంటివ్ ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో కమిటీ సభ్యుడు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ప్రతాప్ రెడ్డి, మెప్మా పీడీ రాధమ్మ, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, లీడ్‌బ్యాంక్ జిల్లా మేనేజర్ సుభాష్, ప్రోగ్రామ్ అధికారి అబ్దుల్లా , జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్యామ్‌మోహన్ పాల్గొన్నారు.

మహిళా యూనివర్సిటీకి నూతన పాలకమండలి


పి.సువర్ణలత దేవి


కే.అనురాధ


కే.ఉమాదేవి


ఏ.లీలారత్నం


డి.శారద


కే.సువర్ణ

తిరుపతి సిటీ: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి నూతన పాలకమండలిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో మహిళా యూనివర్సిటీ అప్లైడ్ మైక్రోబయాలజీ విభాగ ప్రొఫెసర్ పి.సువర్ణలత దేవి, సోషల్ సైన్స్, హ్యూమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ కే.అనురాధ, మహిళా వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్లు కే.ఉమాదేవి, ఏ.లీలారత్నం, మాజీ రెక్టార్ ప్రొఫెసర్ డి.శారద, శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కే.సువర్ణ పాలక మండలి సభ్యులుగా నియమితులయ్యారు. వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థినులు వారికి అభినందనలు తెలిపారు.